
సాక్షి
బాపట్ల
శుక్రవారం । 31 । జనవరి । 2025



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం గురువారం 552.80 అడుగుల వద్ద ఉంది. కుడి కాలువకు 9,700 క్యూసెక్కులు విడుదలవుతోంది.



వాల్‌పోస్టర్స్ ఆవిష్కరణ

బాపట్ల: స్పర్శ కుష్ఠు నివారణ పక్షోత్సవాల సందర్భంగా గురువారం వాల్‌పోస్టర్లను కలెక్టర్ జె.వెంకట మురళి ఆవిష్కరించారు. ఫిబ్రవరి 13 వరకు సర్వే కొనసాగుతుందని తెలిపారు.

విగ్రహాలకు ముసుగులు



నరసరావుపేటఈస్ట్: పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి ఎన్నికల షెడ్యూల్ విడుదల కావటంతో పట్టణంలోని రాజకీయపార్టీల నాయకుల విగ్రహాలకు మున్సిపల్ సిబ్బంది ముసుగులు తొడుగుతున్నారు.

న్యూస్‌రీల్

వాసవీ అమ్మవారికి 15 కిలోల వెండి వస్తువులు బహూకరణ



పిడుగురాళ్ల: పట్టణంలోని జానపాడు రోడ్డులోని వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవాలయంలోని అమ్మవారికి సుమారు 15 కిలోల వెండి వస్తువులను పట్టణానికి చెందిన పెరుమాళ్ల రాజేష్, వనజా లక్ష్మి దంపతులు గురువారం బహూకరించారు. అందులో శ్రీ చక్రం ప్లేటు, కూర్మం, సప్త హారతులు, ఏకహారతి, గంటలను వెండితో తయారు చేయించి అందించారు. వీటి విలువ సుమారు రూ.12.5 లక్షలు ఉంటుందని వారు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, పూజారులు, భక్తులు పాల్గొన్నారు.

కృష్ణానదిపై బ్రిడ్జి నిర్మాణ పనులు ప్రారంభం



అచ్చంపేట: మండల పరిధిలోని మాదిపాడు వద్ద కృష్ణానదిపై బ్రిడ్జి నిర్మాణ పనులను గురువారం ప్రారంభించారు. మాదిపాడు వద్ద కృష్ణానదిపై బ్రిడ్జి నిర్మాణానికి అవసరమైన రూ.62 లక్షల నాబార్డు నిధులను వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి ఎమ్మెల్యే నంబూరు శంకరరావు మంజూరు చేయించిన విషయం తెలిసిందే. 2023 జూన్‌లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బ్రిడ్జి నిర్మాణానికి క్రోసూరులో వర్చువల్‌గా శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అసెంబ్లీ ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో పనులు నిలిచిపోయాయి. మళ్లీ ఇన్ని రోజులకు బ్రిడ్జి నిర్మాణ పనులను కొనసాగించడం పట్ల మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. త్వరితగతిన నిర్మాణ పనులు పూర్తి చేసి పల్నాడు, ఎన్టీఆర్ జిల్లాల మధ్య రాకపోకలను సుగమం చేయాలని కోరుతున్నారు.

ఆర్టీసీ బస్సులో చోరీ

ప్రయాణికురాలి పర్సు కత్తిరించి రూ.2 లక్షల అపహరణ

నరసరావుపేటటౌన్: ఆర్టీసీ బస్సులో ప్రయాణికురాలి పర్సు కత్తిరించి రూ.2 లక్షల నగదు అపహరించిన ఘటన గురువారం పట్టణంలో చోటుచేసుకుంది. వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈపూరు మండలం ఆరేపల్లి ముప్పాళ్లకు చెందిన కొడవలి సుజాత గుంటూరు వెళ్లేందుకు స్వగ్రామం నుంచి నరసరావుపేట ఆర్టీసీ బస్టాండ్‌కు వచ్చారు. బస్సు దిగి మరో బస్సు ఎక్కి చూసుకోగా పర్సులో ఉండాల్సిన నగదు కనిపించలేదు. పర్సు కింది భాగం కత్తిరించబడి ఉంది. సమాచారం అందుకున్న సీఐ విజయ్‌చరణ్ సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఆర్టీసీ బస్టాండ్‌లో సీసీ పుటేజీలను పరిశీలించారు. ఈ మేరకు బాధితురాలిచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

రైలు ఢీకొని మహిళ మృతి

చీరాల రూరల్: రైలు పట్టాలు దాటుతున్న మహిళను గూడ్స్ రైలు ఢీకొనడంతో మృతి చెందిన సంఘటన గురువారం చీరాల-వేటపాలెం రైల్వేస్టేషన్ మధ్య జరిగింది. జీఆర్పీ ఎస్‌ఐ సీహెచ్ కొండయ్య తెలిపిన వివరాలు మేరకు.. రైలు బండిని గమనించకుండా పట్టాలు దాటుతున్న క్రమంలో గూడ్స్ రైలు ఢీకొనడంతో మహిళ మృతి చెందినట్లు ఎస్‌ఐ చెప్పారు. మృతురాలికి 55 సంవత్సరాలుంటాయని తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని చీరాల ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఎవరికైనా ఆచూకీ తెలిసినట్లయితే జీఆర్పీ పోలీసులకు సమాచారం తెలియజేయాలని సూచించారు.

యార్డులో 1,09,020 మిర్చి బస్తాలు విక్రయం

కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు గురువారం 1,02,729 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 1,09,020 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల సగటు ధర రూ.7,000 నుంచి రూ.15,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల సగటు ధర రూ.7,000 నుంచి రూ.15,000 వరకు ధర లభించింది. ఏసీ కామన్ రకం రూ.7,500 నుంచి రూ.13,000 వరకు ధర పలికింది. ఏసీ ప్రత్యేక రకాలకు రూ.8,000 నుంచి రూ.13,500 వరకు ధర లభించింది. తాలు రకం మిర్చికి రూ.4,000 నుంచి రూ.10,500 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో 68,402 బస్తాలు నిల్వ ఉన్నట్లు తెలిపారు.

కూటమి వేధింపులు..ఆగిన గుండె

- 17 ఏళ్లుగా ఫీల్డ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న వెంకటేశ్వరరావు
- కూటమి అధికారంలోకి రాగానే తొలగింపు
- యానిమేటర్‌గా పనిచేస్తున్న భార్య
- ఆమె కూడా తొలగింపు
- పనిచేసిన కాలానికి జీతం ఇవ్వని అధికారులు
- విచారణ పేరుతో వేధింపులు
- ఆర్థిక ఇబ్బందులతో సతమతమౌతున్న కుటుంబం
- మనో వేదనతో గుండెపోటుతో మృతి
- కన్నీరుమున్నీరుగా విలపిస్తున్న కుటుంబసభ్యులు



పులివర్తి మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు

నగరం: కూటమి ప్రభుత్వ వేధింపులు తట్టుకోలేక మనోవేదనతో ఓ గుండె ఆగింది. ఓ వైపు కూటమి ప్రభుత్వ వేధింపులు...మరో వైపు ఆర్థిక ఇబ్బందులతో ఫీల్డ్ అసిస్టెంట్‌గా పనిచేసిన పులివర్తి వెంకటేశ్వరావు(యోహాను)గురువారం తెల్లవారుజామున మృతి చెందాడు. ఈ సంఘటన సజ్జావారిపాలెంలో చోటుచేసుకుంది. మృతుడి కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. గ్రామస్తులు, కుటుంబసభ్యులు తెలిపిన సమాచారం మేరకు.. మండలంలోని సజ్జావారిపాలెం గ్రామానికి చెందిన పులివర్తి వెంకటేశ్వరావు అతియాస్ యోహాన్(50) మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్‌గా 17 సంవత్సరాల నుంచి విధులు నిర్వర్తిస్తున్నాడు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆయనను ఫీల్డ్‌అసిస్టెంట్ విధుల నుంచి తప్పించారు. ఆయన భార్య నాగమణి యానిమేటర్‌గా విధులు నిర్వర్తిస్తుంటే ఆమెను కూడా తొలగించారు. ఇరువురిని ఉద్యోగాల నుంచి తొలగించడంతో కుటుంబం గడవని పరిస్థితులు నెలకొన్నాయి. ఈనేపథ్యంలో వెంకటేశ్వరరావు మరో ఆరుగురు ఫీల్డ్ అసిస్టెంట్‌లు కోర్టును ఆశ్రయించారు. వారిని విధుల్లోకి తీసుకోవాలని కోర్టు ఆదేశించింది. కోర్టు ఆదేశాల జారీ చేసినా వారిని విధుల్లోకి తీసుకోకుండా వారిపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడ్డారు. కోర్టుకు వెళ్లిన ఏడుగురు ఫీల్డ్‌అసిస్టెంట్‌లపై స్పెషల్ ఆడిట్ వేశారు. ఉపాధి హామీ పథకంలో అవినీతికి పాల్పడ్డారని, మీపై విచారణ చేస్తున్నామని అధికారులు తెలపడంతో వెంకటేశ్వరరావు మరింత ఆందోళనకు గురయ్యాడు. ఒక పక్క కుటుంబం గడవని పరిస్థితి, మరోపక్క కూటమి ప్రభుత్వ వేధింపుల నేపథ్యంలో మనోవేదనకు గురయ్యారు. ఆయనకు ఇటీవల గుండె ఆపరేషన్ చేశారు. మందులు తెచ్చుకునేందుకు డబ్బులు లేక బంగారం కుదువ పెట్టానని, ఫీల్డ్ అసిస్టెంట్‌గా పనిచేసిన కాలానికి జీతం ఇవ్వాలని ఎంపీడీవో, ఎంఎన్ఆర్ఈజీఎస్ ఏపీవోకి మొర పెట్టుకున్నాడు. వారు కనికరించలేదు. ఓ వైపు అనారోగ్యం.. మరోవైపు ఆర్థిక ఇబ్బందుల నేపథ్యంలో గురువారం గుండెపోటుకు గురై మృతి చెందాడు. ఆయనకు ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. ఇద్దరు కుమార్తెలు వివాహాలు కాగా ఒక అమ్మాయికి వివాహం కాలేదు.



వెంకటేశ్వరావు (ఫైల్)

వైఎస్సార్ సీపీ నేతల నివాళి

కూటమి ప్రభుత్వ వేధింపులకు బలైన వెంకటేశ్వరావు మృతదేహాన్ని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఇంకొల్లు రామకృష్ణ సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు రూ.5వేల ఆర్థిక సాయం అందజేశారు. వైఎస్సార్ సీపీ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి కోటేశ్వరరావు, వెంకటేశ్వరరావు, ఖాదర్‌వలి, ప్రభాకర్, బాబురావు, కిరణ్ పాల్గొన్నారు.

హామీలు ఎగ్గొట్టేందుకే

బాబు తప్పుడు ప్రచారం

- దమ్ముంటే ప్రజలకిచ్చిన హామీలు నెరవేర్చాలి
- రూ.14 లక్షల కోట్ల అప్పులు చేశారని ఎన్నికల్లో తప్పుడు ప్రచారం
- అధికారం అప్పగిస్తే సంపద సృష్టిస్తానన్నారు
- హామీలు ఇచ్చేటప్పుడు ఇవన్నీ తెలియవా?
- మా నాయకుడు జగన్ జనం కష్టాలు తీర్చారు
- ఆది నుంచి చంద్రబాబుది వంచన నైజం
- 'సాక్షి'తో వైఎస్సార్‌సీపీ బాపట్ల జిల్లా అధ్యక్షుడు మేరుగ నాగార్జున

సాక్షి ప్రతినిధి, బాపట్ల: సూపర్‌సిక్స్ హామీలను ఎగ్గొట్టేందుకే సీఎం చంద్రబాబు వైఎస్సార్‌సీపీ హయాంలో ఆర్థిక విధ్వంసం జరిగిందంటూ ఆరోపణలకు దిగారని, కథలు, కహానీలు, కాకిలెక్కలు, తప్పుడు ప్రచారాలు పక్కనబెట్టి ప్రజలకు ఇచ్చిన హామీలు వెంటనే నెరవేర్చాలని వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ బాపట్ల జిల్లా అధ్యక్షుడు మేరుగ నాగార్జున డిమాండ్ చేశారు. బుధవారం ఆయన సాక్షితో మాట్లాడారు. చంద్రబాబు తప్పుడు లెక్కలు చెప్పినా కాగ్ లెక్కలు, అధికారిక గణాంకాలను ఎవరూ దాచిపెట్టలేరన్నారు. బాబు దృష్టిలో సంపద సృష్టించడమంటే బాదుడే బాదుడు అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడు నెలల్లోనే రూ.15 వేల కోట్లకు పైగా విద్యుత్ చార్జీల భారాన్ని ప్రజలపై మోపారని విమర్శించారు. భావి తరాల కోసం వైఎస్సార్ సీపీ ప్రభుత్వం సృష్టించిన విలువైన సంపద లాంటి మెడికల్ కాలేజీలు, పోర్టులను ప్రైవేటుకు బేరం పెడుతున్నారని విమర్శించారు. ఇవన్నీ దాచిపెట్టి ప్రజల దృష్టి మళ్లించేందుకే చంద్రబాబు నిస్సిగ్గుగా అబద్ధాలు చెబుతున్నారని విమర్శించారు. ఒక ఆర్థిక వ్యవస్థ బాగుందని చెప్పేందుకు మూలధన వ్యయం, అప్పుల వృద్ధి తీరును కొలమానంగా పరిగణిస్తారని లెక్కలన్నీ చూశాక ఆర్థిక క్రమశిక్షణతో ఎవరు పాలన సాగించారో ప్రతి ఒక్కరూ చెబుతారన్నారు. 2023-24లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అత్యధికంగా మూలధన వ్యయం వేసిందని, దాన్ని వదిలేసి చంద్రబాబు ప్రజెంటేషన్ ఇవ్వడం ముఖ్యమంత్రి స్థాయిలో ఉన్నవారు చేయాల్సిన పనికాదని విమర్శించారు. గతంలో చంద్రబాబు హయాంతో పోలిస్తే వైఎస్సార్‌సీపీ ఐదేళ్ల పాలనలో తక్కువగా అప్పులు చేయడమే కాకుండా మూలధన వ్యయం అధికంగా చేసిందన్నారు. 2022-23లో వైఎస్సార్‌సీపీ రూ.67.265 కోట్లు అప్పు చేసి మూలధన వ్యయం రూ.7244 కోట్లు మాత్రమే చేసిందని చంద్రబాబు తప్పుబట్టారని, మరి ఈ ఆర్థిక ఏడాదిలో రూ.78,635.82 కోట్లు అప్పు చేసిన చంద్రబాబు మూలధన వ్యయం రూ.8,894.98 కోట్లే చేసిన విషయాన్ని ఎందుకు దాచి పెడుతున్నారని మేరుగ ప్రశ్నించారు. డీబీటీ ద్వారా నేరుగా రూ. 2.73 లక్షల కోట్లు ప్రజలకు పారదర్శకంగా అందించిన పాలకుడు విధ్వంసకారుడా? ఐదేళ్లలో ఏమీ చేయకుండా మాటలతో మభ్యపెట్టి సింగపూర్ గ్రాఫిక్స్ చూపిన నాయకుడు విధ్వంసకారుడా? అని ఆయన ప్రశ్నించారు. రాష్ట్రంలోని ప్రతి గ్రామంలో సచివాలయాలు, ఉద్యోగాలు, ఆర్‌బీకేలు, ఆస్పత్రులు, ఇంగ్లిషు మీడియం స్కూళ్లు తెచ్చిన వ్యక్తి విజన్ ఉన్నవారు లీడరా? 14 ఏళ్లు పాలించినా ఏ ఒక్క పథకం నాది అని చెప్పుకోలేని దుస్థితిలో ఉన్న వ్యక్తి విజనరా? అని ప్రశ్నించారు. ఇప్పటికైనా చంద్రబాబు కాకిలెక్కలు చెప్పడం మాని ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేశారు.



హైకోర్టు స్టే ఆర్డర్ బేఖాతర్

- ఆగని అధికార జులుం
- చిన్నకొత్తపల్లిలో మళ్లీ తొలగింపుల పర్వం

టాస్క్‌ఫోర్స్: బాపట్ల జిల్లా అద్దంకి మండలంలోని చిన్నకొత్తపల్లి గ్రామంలో వైఎస్సార్ సీపీ సానుభూతి పరులపై అధికార జులుం కొనసాగుతూనే ఉంది. టీడీపీ నాయకుల ఒత్తిళ్ల మేరకు రెండు రోజుల కిందట గ్రామంలోని పేద రైతుల పశువుల పాకలు, పేడ దిబ్బలను, పశుగ్రాస వాములను అధికారులు పోలీసుల సాయంతో తొలగించిన విషయం తెలిసిందే. ఈ విషయమై హైకోర్టును ఆశ్రయించిన వైఎస్సార్ సీపీ సానుభూతిపరులకు గురువారం హైకోర్టు నుంచి స్టే ఆర్డర్ వచ్చింది. దాని ప్రకారం పంచాయతీ అధికారులు ఆ స్థలానికి సంబంధించి నోటీసులు ఇవ్వకుండా ఏ చర్య తీసుకోవద్దని, తదుపరి విచారణ వరకు వేచి ఉండాలని ఆర్డర్ ఇచ్చినట్లు బాధితులు తెలిపారు. రెండు రోజుల తరువాత మళ్లీ అదే గ్రామంలో పంచాయతీ సెక్రటరీ నాగేశ్వరరావు పొక్లెయిన్‌తో వెళ్లి మళ్లీ తొలగింపులు చేపట్టాడు. హైకోర్టు స్టే ఆర్డర్ ఇచ్చిందని ఆ కాపీ చూపించినా లెక్క చేయలేదు. దాంతో వారు మళ్లీ సాక్ష్యాధారాలతో హైకోర్టులో స్థానిక గ్రామ పంచాయతీ సెక్రటరీ పై కోర్టు ధిక్కరణ పిటిషన్‌ను దాఖలు చేస్తామని తెలిపారు. న్యాయం కోసం కోర్టును ఆశ్రయించామని.. అక్కడే తేల్చుకుంటామని చెబుతున్నారు. ఈ విషయమై గ్రామ పంచాయతీ సెక్రటరీ నాగేశ్వరరావును సాక్షి ఫోన్‌లో వివరణ కోరగా ఆ ఆర్డరు ఖాళీ చేయించే స్థలానికి సంబంధించింది కాదని తెలిపారు.



తొలగింపులను అడ్డుకుంటున్న బాధితులు

జనవరి పండుగపై వివాదం

- నిర్వహణ తేదీపై రెండు వర్గాల మధ్య వివాదం
- ఓ వర్గానికి వత్తాసు పలికిన పోలీసులు, అధికారులు
- అధికారుల తీరును నిరసిస్తూ ఆందోళన
- పోలీసుల సమక్షంలో పండుగ నిర్వహణకు అనుమతి
- ఏర్పాట్లలో నిమగ్నమైన సంఘస్తులు

జంపని(వేమూరు): పోలీసులు అధికార పార్టీకి కొమ్ముకాయడంతో జనవరి పండుగ నిర్వహణపై సంఘస్తుల మధ్య విభేదాలు చోటుచేసుకున్నాయి. అధికారులు, పోలీసుల తీరును నిరసిస్తూ ఓ వర్గం ఆందోళనకు దిగింది. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు అధికారులతో చర్చలు జరిపారు. చివరకు పోలీసుల సమక్షంలో పండుగ జరుపుకునేందుకు అంగీకరించి ఏర్పాట్లు చేస్తున్నారు. వేమూరు మండలం జంపని గ్రామంలో బాప్టిస్టు చర్చి అధ్వర్యంలో జనవరి పండుగ శుక్రవారం జరుపుకునేందుకు ఒక వర్గం పాస్టరుతో ప్రకటన చేయించారు. రెండో వర్గం శుక్రవారం జరుపుకునేందుకు రేపల్లె డీఎస్పీ ద్వారా అనుమతి పొందారు. మొదటి వర్గం ఈనెల 27వ తేదీ సాయంత్రం వేమూరు పోలీసుస్టేషన్‌కు వెళ్లి పండగ జరుపుకునేందుకు అనుమతి ఇవ్వాలని ఎస్‌ఐ రవికృష్ణను కోరారు. ఎస్‌ఐ రవికృష్ణ సంఘస్తులను ఇష్టారాజ్యంగా బూతులు తిట్టి 29వ తేదీనే పండగ జరుపుకోవాలని సూచించాడు. సంఘస్తులు గురువారం పండుగ జరుపుకుంటామని ఎస్‌ఐకి చెప్పారు. ఆ రోజు పండుగకు అనుమతి లేదని చెప్పాడు. దీంతో సంఘస్తులు వైఎస్సార్‌సీపీ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి, నియోజకవర్గ సమన్వయ కర్త వరికూటి అశోక్‌బాబును ఆశ్రయించారు. వెంటనే సీఐతో మాట్లాడి పండుగ జరుపుకునేందుకు అనుమతి ఇవ్వాలని కోరారు. ఎలాంటి గొడవలు జరగకుండా గురువారం జరుపుకోవాలని సీఐ తెలిపారు. సంఘ పెద్దలు వెళ్లి తహసీల్దారు వద్ద బైండోవర్ కావాలని సీఐ తెలిపారు. గురువారం ఉదయం 10 గంటలకు సంఘ పెద్దలు వేమూరు తహసీల్దారు కార్యాలయానికి వెళ్లారు. సంఘ పెద్దలు తహసీల్దారు సుశీలను కలిశారు. సంతకాలు చేయించుకొని పండుగకు అనుమతి లేదని ఆమె తెలిపారు. అనుమతి లేనపుడు సంఘ పెద్దలతో సంతకాలు ఎందుకు చేయించుకున్నారని తహసీల్దార్‌ను అశోక్‌బాబు ప్రశ్నించారు. అధికారుల తీరును నిరసిస్తూ సంఘ పెద్దలు, సంఘస్తులు చర్చి సమీపంలో రోడ్డుపై ధర్నా నిర్వహించారు. అశోక్‌బాబు గ్రామ సర్పంచ్ చుండూరు పెద్ద మరియమ్మ ఇంటికి వెళ్లారు. వేమూరు, చుండూరు సీఐ, ఎస్‌ఐలు జంపని గ్రామానికి చేరుకుని అశోక్‌బాబుతో సంప్రదింపులు జరిపారు. గురువారం సాయంత్రం పండుగ జరుపుకోవాలని సీఐ సంఘ పెద్దలకు సూచించారు. సంఘ పెద్దలు, సంఘస్తులు పండుగ జరుపుకునేందుకు సిద్ధం అవుతుండగా చర్చిలో రెండు వర్గాల మధ్య గొడవ జరిగింది. పోలీసులు తమపై చేయి చేసుకున్నారని మహిళలు ఆరోపించారు. మహిళలపై చేయి ఎందుకు చేసుకున్నారంటూ వేమూరు సీఐని అశోక్‌బాబు ప్రశ్నించారు. పోలీసులు సహకరించి పండుగ జరిపించాల్సింది పోయి అధికార పార్టీకి కొమ్ముకాయడం అన్యాయమని అన్నారు. చివరకు పోలీసుల సమక్షంలో పండగ జరుపుకునేందుకు అనుమతి ఇచ్చారు. దీంతో సంఘ పెద్దలు, సంఘస్తులు పండుగ ఏర్పాట్లలో నిగ్నమైయ్యారు.



తహసీల్దారును ప్రశ్నిస్తున్న వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త అశోక్‌బాబు



చర్చిలో ఇరువర్గాల మధ్య గొడవ

ఎస్‌ఐ రవికృష్ణను సస్పెండ్ చేయాలి

అధికార పార్టీకి తొత్తుగా వ్యవహరిస్తున్న వేమూరు ఎస్‌ఐ రవికృష్ణను సస్పెండ్ చేయాలని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు డిమాండ్ చేశారు. పోలీసులు అత్యుత్సాహం చూపించడం వల్ల రెండు వర్గాల మధ్య గొడవలు చోటుచేసుకున్నాయని ఆయన అన్నారు.

రేపటి నుంచి కందులు కొనుగోలు

కొరిటిపాడు(గుంటూరు): పల్నాడు జిల్లాలో ఫిబ్రవరి 1వ తేదీ నుంచి కందులు కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తున్నట్లు గుంటూరు, పల్నాడు జిల్లాల మార్క్‌ఫెడ్ మేనేజర్ ఆర్‌జే కృష్ణారావు తెలిపారు. గురువారం సాయంత్రం ఆయన 'సాక్షి'తో మాట్లాడారు. రైతులు పండించిన కంది పంటను కనీస మద్దతు ధర క్వింటాల్‌కు రూ.7,550లకు నాఫెడ్ తరపున మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. ముందుగా కందులు పండించిన రైతులు రైతు సేవా కేంద్రాల్లో సీఎం యాప్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. పల్నాడు జిల్లాలో 28 మండలాల్లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేయాలని నిర్ణయించడం జరిగిందన్నారు. ఇప్పటి వరకు 202 మంది రైతులు రిజిస్ట్రేషన్ చేయించుకున్నట్లు వెల్లడించారు. కోసిన కంది పంటను నూర్పిడి చేసి బాగా ఆరబెట్టి శుభ్రం చేసుకోవాలన్నారు.

తాళపత్ర గ్రంథ పరిష్కారానికి కేరాఫ్ చంద్రమౌళి

- రాష్ట్రంలో రెండో వ్యక్తిగా పేరు ప్రఖ్యాతులు
- పదిపైగా తాళపత్రాలకు శుద్ధ ప్రతుల తయారీ
- తాళపత్ర మన్నిక 300 సంవత్సరాలకు పైమాటే
- తాళపత్రాల సేకరణకు ప్రోత్సాహం ఇవ్వాలంటున్న చంద్రమౌళి

అద్దంకి: తాళ పత్రాల గ్రంథాలను పరిష్కరించడంలో బాపట్ల జిల్లా అద్దంకి పట్టణానికి చెందిన జ్యోతి చంద్రమౌళి కేరాఫ్‌గా నిలుస్తున్నారు. ఈయన తాళపత్ర గ్రంథాలను పరిష్కరించడంలో కృష్ణా జిల్లాకు చెందిన తంగిరాల సుబ్బారావు తరువాత రాష్ట్రంలోనే రెండో వ్యక్తిగా నిలిచాడు. ఈయన వృత్తి రీత్యా ఉపాధ్యాయుడిగా పనిచేసే సమయం నుంచి రిటైరైన తరువాత తాళపత్రాలను సేకరించి వాటిని శుభ్రం చేసి వాటికి పుస్తక రూపం ఇచ్చి భావితరాలకు అందేలా కృషి చేస్తున్నారు. ఆయన ఇప్పటికి పది తాళపత్రాల గ్రంథాలను పరిష్కరించి శుద్ధ ప్రతులను తయారు చేశారు. ఇప్పటికే ఒక గ్రంథం అచ్చయింది. మిగిలిన వాటికి పుస్తకం రూపం ఇవ్వడం ఖర్చుతో కూడుకున్న పని. ప్రభుత్వం ప్రోత్సాహమో, లేక ఏదైనా సంఘాల చేయూత ఉంటేనే అవి అచ్చు అవుతాయి.

ఇప్పటి వరకు పరిష్కరించిన తాళపత్ర గ్రంథాలు

చంద్రమౌళి తన దగ్గరకు తెచ్చి ఇచ్చిన తాళపత్ర గ్రంథాల్లో ఇప్పటికి పోచయ్య బొంగరాలాట, కాటంరాజు కథ, వల్లురాజు కథ, ఆవుల మేపు, భట్టు రాయభారం, తరిగొండ వెంగమాంబ కథ, రాజయోగామృత సారం, గ్రామీణ వైద్యం అనే గ్రంథాలకు పుస్తకం రూపం ఇచ్చారు. పురాతన తాళపత్రాల గ్రంథాలను పరిష్కరించడం అంత తేలికైనపని కాదు. ఒక్కో ఆకు భద్రంగా బయటకు తీసి వాటికి రెండు రకాల రసాయనాలు పూస్తేనే అందులోని అక్షరాలు కనిపించి పరిష్కారానికి ఉపయోగిస్తాయి.

తాళపత్ర పూర్వ చరిత్ర..

జ్యోతి చంద్రమౌళి అందించిన వివరాల మేరకు ప్రస్తుతం, ఏదైనా రచన చేయాలన్నా ఉత్తరం రాయాలన్నా కాగితం అవసరం. అయితే అది ఇప్పటి మాట. ఒకప్పుడు కాగితాలు లేవు. అప్పుడు గ్రంథాలను రాయాలన్నా ఉత్తరాలు రాయాలన్నా తాళ (తాటి ఆకులు) పత్రాలను వాడేవారు. ప్రముఖంగా గ్రంథాలను రాయడానికి వీటిని ఎక్కువగా ఉపయోగించేవారు. అంతకు మునుపు తామ్ర పత్రాలు అంటే సన్నగా చేసిన రేకులపైన రాసేవారు. ఇవి 300 సంవత్సరాలకు పైగానే మన్నుతాయి.



తాళ పత్రాలను పరిశీలిస్తున్న జ్యోతి చంద్రమౌళి



ఒక ఆకుపై రాసిన అక్షరాలు



తయారు చేసిన శుద్ధ ప్రతులు

తాళపత్రాల సేకరణకు ప్రోత్సహించాలి

తాళపత్ర గ్రంథాలు ఇప్పటికే వేటపాలెం, రాజమండ్రి, కడప వంటి గ్రంథాలయాల్లో ఉన్నాయి. అయితే ఇంకా చాలా గ్రంథాలు తరతరాల నుంచి ఇళ్లల్లో ఉన్నాయి. ఆయా గ్రంథాలను బయటకు తీసి వాటికి పుస్తక రూపం ఇస్తే ఆయా గ్రంథాలు వెలుగు చూస్తాయి.

– విద్వాన్ జ్యోతి చంద్రమౌళి, రచయిత, శాస్త్ర పరిశోధకుడు

ప్రకృతి సాగులో మెరిసినారిలా

సేద్య 'సాధికారత'

- పెదకూరపాడు ప్రాంతంలో 500 మంది మహిళా రైతుల సాగు
- సేంద్రియ ఉత్పత్తులతో లాభాల బాట

పెదకూరపాడు: వారందరూ మహిళా రైతులు.. రైతు సాధికారత సంస్థ సహాయంతో ప్రకృతి సాగు దిశగా ఒక్కో అడుగు ప్రారంభించారు.. ఆర్థిక ఇబ్బందులు లేకుండా సేంద్రియ ఉత్పత్తులతో లాభాల బాట పతున్నారు. కషాయాలు, ఘన, జీవామృతాలను వినియోగించి సేద్యం చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. పెదకూరపాడు మండల వ్యాప్తంగా 524 ఎకరాల్లో 500 మంది మహిళా రైతులు భర్తల సాయంతో ప్రకృతి వనరులే పెట్టుబడిగా ఆకు కూరలు, కూరగాయలు, ముల్లంగి, చిక్కుడు, క్యారెట్, కొత్తిమీర, పుదీనా, గోంగూర, దోస, పత్తి, మిర్చిలాంటి పంటలను సాగు చేస్తున్నారు. సహజంగా దొరికే పశువుల పేడ, గోమూత్రం, ఎరువులు, కషాయాలు, జీవామృతం, ఘనజీవామృతం పొలాల్లోనే తయారు చేసుకుని డ్రోన్లతో పిచికారీ చేయిస్తున్నారు.

రద్దీ ప్రాంతాల్లో విక్రయాలు

పండించిన పంట ఉత్పత్తులను నేరుగా విక్రయిస్తున్నారు. సమీప పట్టణాలకు తీసుకెళ్లి ప్రభుత్వ కార్యాలయాలు, రద్దీ ప్రాంతాలు, వ్యాపార సముదాయాల వద్ద అమ్మకాలు చేస్తున్నారు.



ప్రకృతి విధానంలో సాగు చేస్తున్న మిరప పంట



ఆకు కూరలు విక్రయిస్తున్న మహిళా రైతులు

20 సెంట్లలో సేద్యం



మాకు ఉన్న 20 సెంట్లలో దోస, క్యారెట్, ముల్లంగి, తోటకూర, గోంగూర, పుదీనా సాగు చేశాను. మంచి ఆదాయం వస్తోంది. కుటుంబ పోషణతోపాటు లాభాలు బాగానే ఉన్నాయి. ప్రస్తుత కాలంలో ప్రకృతి వ్యవసాయమే మేలు.

– నందిగామ జోత్స్న, పెదకూరపాడు

ఏదో పంటలో ఆదాయం వస్తోంది



రెండు ఎకరాల్లో దోస, చిక్కుడు, క్యారెట్, ఆకు కూరలు, ముల్లంగి, మిరప, పత్తి ఇలా అనేక రకాల పంటలను సాగు చేస్తున్నాం. వీటిలో ఏదో ఒక పంట ద్వారానైనా బాగా ఆదాయం వస్తోంది. ఆరోగ్యకరమైన కూరగాయలు తింటున్నాం. లాభదాయకంగా ఉంది.

–మట్టుపల్లి హృదయలక్ష్మి, పెదకూరపాడు

ఖర్చులు బాగా తగ్గాయి



ఎకరంలో ఆకు కూరలు, కూరగాయలు సాగు చేస్తున్నాం. ప్రకృతి సేద్యంతో ఖర్చులు బాగా తగ్గాయి. దిగుబడి కూడా ఎక్కువగా ఉంటుంది. కుటుంబ పోషణతోపాటు పది మందికి ఉపాధి కల్పిస్తున్నాం. మేమే స్వయంగా ఉత్పత్తులను విక్రయిస్తున్నాం.

– షేక్ మహిబూబ్, పెదకూరపాడు

క్లుప్తంగా

రేపు పింఛన్ల పంపిణీ

నరసరావుపేట: ఎన్టీఆర్ భరోసా పింఛన్ పథకం ద్వారా శనివారం పల్నాడు జిల్లాలో 2,72,932 మంది పింఛనుదారులకు రూ.117.87 కోట్లు పంపిణీ చేయనున్నట్లు డీఆర్డీఏ పీడీ బి.బాలునాయక్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రెండు నెలలుగా పింఛను నగదు తీసుకోని వారికి మొత్తం అందిస్తామని పేర్కొన్నారు. పింఛను ఇచ్చేందుకు సిబ్బంది ఇంటికి రాకున్నా, డబ్బులు డిమాండ్ చేసినా, ప్రవర్తన సరిగా లేకున్నా.. 91211 90656 నంబరుకు ఫిర్యాదు చేయొచ్చని పీడీ తెలిపారు.

పకడ్బందీగా స్కూలు మ్యాపింగ్ ప్రక్రియ

విద్యాశాఖ అధికారులకు సూచించిన కలెక్టర్

నరసరావుపేట: స్కూల్ మ్యాపింగ్ ప్రక్రియ పకడ్బందీగా చేయాలని, ప్రతి పంచాయతీలో కనీసం ఒక మోడల్ పాఠశాల ఉండేట్లుగా చూడాలని పల్నాడు జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ, జిల్లాలోని 28 మండలాల విద్యాశాఖ అధికారులతో పాఠశాలల పునఃవ్యవస్థీకరణ ప్రతిపాదనలకు సమీక్ష సమావేశం నిర్వహించారు. విద్యార్థుల సంఖ్య 60 దగ్గర్లో ఉన్న వాటిని మోడల్ ప్రాథమిక పాఠశాలలుగా ప్రతిపాదించాలని తెలిపారు. సుదూర ప్రాంతాల్లోని పాఠశాలలను పిల్లలకు ఇబ్బంది లేకుండా యథాతదంగా కొనసాగించాలని స్పష్టం చేశారు. ఏ పాఠశాలలను మూసివేయడం జరగదని, విద్యార్థులకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఉప విద్యాశాఖాధికారి పాల్గొన్నారు.

చోరీ కేసులో నిందితుడి అరెస్టు

మాచర్ల:పట్టణంలోని రూపే కాలనీలో ఇళ్ల తాళాలు పగులగొట్టి గ్యాస్ సిలిండర్లు, పలు వస్తువులు చోరీ చేసిన నిందితుడు రామ్‌నాయక్‌ను అరెస్టు చేసినట్లు అర్బన్ సీఐ ప్రభాకరరావు, ఎస్సై సంధాని గురువారం తెలిపారు. కొద్దిరోజులుగా నిందితుడు పలు ప్రాంతాల్లో తాళాలు వేసి ఉన్న ఇళ్లల్లోకి చొరబడి వెండి వస్తువులు, గ్యాస్ సిలిండర్లు చోరీ చేస్తున్నాడు. బాధితుల ఫిర్యాదు మేరకు నిందితుడిని అరెస్టు చేసి మాచర్ల అదనపు సివిల్ జడ్జి కోర్టులో హాజరుపరిచినట్లు తెలిపారు.

ఉపాధ్యాయుల వివరాలు అప్‌డేట్ చేసుకోవాలి

గుంటూరు ఎడ్యుకేషన్: జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న అన్ని కేడర్ల ఉపాధ్యాయులు శుక్రవారం సాయంత్రానికి పూర్తి వివరాలను టీచర్ ఇన్ఫర్మేషన్ సిస్టం (టీఐఎస్) సైట్‌లో అప్‌డేట్ చేసుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి సీవీ రేణుక గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. సీఎస్ఈ.ఏపీ.జీటీవీ.ఇన్ సైట్‌లో వ్యక్తిగత లాగిన్ ద్వారా వివరాలను నమోదు చేయాలని సూచించారు. లాంగ్ లీవ్, వీహెచ్, సస్పెన్షన్‌లో ఉన్న ఉపాధ్యాయులు సైతం విధిగా నమోదు చేసుకోవాలన్నారు. ఒక్క ఉపాధ్యాయుడి పేరు నమోదు కాకున్నా అందుకు సంబంధిత డీడీవోలే బాధ్యత వహించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ప్రభుత్వ, జెడ్పీ, మండల పరిషత్, ఎయిడెడ్, మున్సిపల్ ఉపాధ్యాయుల పేర్లు ఏ కారణం చేతనైనా టీఐఎస్‌లో కనిపించని పక్షంలో సదరు ఉపాధ్యాయుల వివరాలతో పాటు ట్రెజరీ ఐడీని ఐటీ సెల్‌కు పంపాలని సూచించారు.

శాంతి ఆయుధంగా ముందుకు సాగిన మహాత్ముడు



గాంధీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అంబటి, మోదుగుల తదితరులు

పట్నంబజారు: విప్లవం, హింస లేకుండా శాంతియుతంగానే ఏదైనా సాధించవచ్చని చాటి చెప్పిన మహనీయుడు జాతిపిత మహాత్మా గాంధీ అని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు కీర్తించారు. బృందావన్ గార్డెన్స్‌లోని పార్టీ జిల్లా కార్యాలయంలో గురువారం గాంధీజీ వర్ధంతిని పురస్కరించుని ఆయన చిత్రపటానికి జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు, పార్టీ గుంటూరు, పల్నాడు జిల్లాల పరిశీలకులు మోదుగుల వేణుగోపాల్‌రెడ్డి, నగర మేయర్ కావటి మనోహర్ నాయుడు, నగర డిప్యూటీ మేయర్, పార్టీ నగర అధ్యక్షుడు వనమా బాలవజ్రబాబు (డైమండ్‌బాబు), తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరిఫాతిమా, పార్టీ నేతలతో కలిసి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా అంబటి రాంబాబు మాట్లాడుతూ.. మానవాళికి మంచిగా మెలగటాన్ని నిర్దేశించిన ఘనత బాపూజీదేనన్నారు. ప్రతి ఒక్కరూ ఆయన అడుగుజాడల్లో నడిచి, అహింసా మార్గంలో ముందుకు సాగాలన్నారు. మోదుగుల వేణుగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. భావి తరాలకు గాంధీ విలువలను తెలియజెప్పాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ప్రపంచవ్యాప్తంగా గాంధీజీ అంటేనే ఒక గొప్ప మానవతావాదిగా గుర్తింపు పొందారని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు నిమ్మకాయల రాజనారాయణ, పోలూరి వెంకటరెడ్డి, నందేటి రాజేష్, మాదిరెడ్డి శ్రీనివాసరెడ్డి, మండేపూడి పురుషోత్తం, కొత్తా చిన్నపరెడ్డి, మామిడి రాము, ఆవుల సుందర్‌రెడ్డి, బత్తుల దేవానంద్, బైరెడ్డి రవీంద్రారెడ్డి, బొర్రా వెంకటేశ్వరరెడ్డి, రాచకొండ ముత్యాల రాజు, కొరిటిపాటి ప్రేమ్‌కుమార్, కార్పొరేటర్లు పడాల సుబ్బారెడ్డి, రోషన్, మర్రి అంజలి, అంబేడ్కర్, దూపాటి వంశీ, అచ్చాల వెంకటరెడ్డి, బూసి రాజలత, మర్రి సత్యన్నారాయణ, పార్టీ నేతలు, డివిజన్ అధ్యక్షులు, అనుబంధ విభాగాల నేతలు తదితరులు పాల్గొన్నారు.

ఫార్మసీ సిలబస్ డిజిటలీకరణ



సావనీర్ ఆవిష్కరిస్తున్న ప్రతినిధులు

చేబ్రోలు: పెరుగుతున్న ఇండస్ట్రీ అవసరాలు, టెక్నాలజీలకు అనుగుణంగా ఫార్మసీ సిలబస్‌ను డిజిటలైజ్ చేయబోతున్నామని ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (పీసీఐ) ప్రెసిడెంట్ డాక్టర్ మోంటుకుమార్ ఎం.పటేల్ అన్నారు. చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ ఫార్మసీ కళాశాలలో ''ఎమర్జింగ్ ట్రెండ్స్ ఇన్ పర్సనలైజ్డ్ డ్రగ్ డిస్కవరీస్- ఏ ఫ్యూచరిస్టిక్ అప్రోచ్'' అంశంపై మూడు రోజుల ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్‌ను ''నెక్స్ట్‌జెన్ ఫార్మా కనెక్ట్-2025'' అనే ఇతివృత్తంతో గురువారం ఘనంగా ప్రారంభించారు. ముందుగా సావనీర్ విడుదల చేశారు. మోంటుకుమార్ ఎం.పటేల్ మాట్లాడుతూ.. పీసీఐ ద్వారా విద్యార్థులకు, అధ్యాపకులకు సరికొత్త టెక్నాలజీపై ట్రైనింగ్, స్కిల్స్ పెంపొందించడానికి కృషి చేస్తున్నామన్నారు. ఢిల్లీలోని పీసీఐ సెంట్రల్ కౌన్సిల్ మెంబర్ డాక్టర్ ఎం.వెంకటరమణ మాట్లాడుతూ.. పర్సనలైజ్డ్ డ్రగ్ డిస్కవరీస్ వలన జన్యుపరమైన విశ్లేషణ ద్వారా ఏ ఔషధం రోగికి అనుకూలమవుతుందో ముందుగానే అంచనా వేసి సరైన మందును అందించవచ్చని చెప్పారు. వివిధ అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏపీ ఫార్మసీ కౌన్సిల్ మెంబర్, ఢిల్లీలోని పీసీఐ సెంట్రల్ కౌన్సిల్ మెంబర్ డాక్టర్ ఎస్.ఎల్.ఎన్ ప్రసాద్‌రెడ్డి, డాక్టర్ ఎం.విల్లియం కారే, విజ్ఞాన్ విద్యాసంస్థల చైర్మన్ లావు రత్తయ్య, ప్రిన్సిపల్ పి.శ్రీనివాస బాబు తదితరులు పాల్గొన్నారు.

బెల్లం ఊట ధ్వంసం



వేటపాలెం: మండల పరిధిలోని అక్కాయిపాలెం దగ్గరలో బైపాస్ రోడ్డు పక్కన గల జీడి మామిడి తోటలో దాచి ఉంచిన బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్లు ఎక్సైజ్ సీఐ నాగేశ్వరరావు గురువారం తెలిపారు. తమకు వచ్చిన సమాచారం మేరకు జీడి తోటలో నాటుసారా తయారీ కోసం ప్లాస్టిక్ డ్రమ్ముల్లో నిల్వచేసిన బెల్లం ఊటను భూ మిలో దాచి ఉంచినట్లు తెలిపారు. వాటిని గుర్తించి డ్రమ్ములను అక్కడే ధ్వంసం చేసినట్లు తెలిపారు.

ఉరి వేసుకుని విద్యార్థి ఆత్మహత్య

మాచర్ల రూరల్: మండల పరిధిలోని రాయవరం గ్రామ సమీపంలో ఉన్న ఓ ప్రైవేటు పాఠశాల హాస్టల్ గదిలో 9వ తరగతి విద్యార్థి పంది రాజశేఖర్ (16) ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన గురువారం చోటుచేసుకుంది. రూరల్ పోలీసుల కథనం మేరకు.. వెల్దుర్తి మండలం లోయపల్లి గ్రామానికి చెందిన రాజశేఖర్ మధ్యాహ్నం పాఠశాల నుంచి హాస్టల్‌కు వెళ్లి భోజనం చేశాడు. తర్వాత గదిలో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు తాడుతో ఉరివేసుకున్నాడు. విషయం తెలుసుకున్న యాజమాన్యం రాజశేఖర్‌ను హుటాహుటిన ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స నిర్వహిస్తుండగా విద్యార్థి మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు.

యల్లమంద, చినతురకపాలెంలో కలెక్టర్ పర్యటన



గొనె సంచుల తయారీ కార్మికురాలితో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు

నరసరావుపేట రూరల్: మండలంలోని యల్లమంద, చినతురకపాలెం గ్రామాల్లో జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు గురువారం పర్యటించారు. చినతురకపాలెంలోని గొనె సంచుల తయారీ యూనిట్లను సందర్శించారు. కార్మికుల స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. గొనె సంచుల తయారీ మిషన్ల ఏర్పాటుకు గ్రూపులుగా ఏర్పడితే రూ.10లక్షలు ఆర్థిక సాయం అందిస్తామని కలెక్టర్ తెలిపారు. గ్రామంలోని ఉర్దూ పాఠశాలను సందర్శించిన కలెక్టర్‌కు 8వ తరగతి వరకే బోధన చేస్తున్నారని, 9, 10వ తరగతులు ప్రారంభించాలని గ్రామస్తులు విన్నవించారు. చర్యలు తీసుకుంటామని కలెక్టర్ వారికి సమాధానం ఇచ్చారు. యల్లమందలో గృహ నిర్మాణాలను పరిశీలించి, లబ్ధిదారులతో మాట్లాడారు. నిర్మాణాలను వేగంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. గ్రామంలోని కల్యాణ మండపాన్ని నిధులు కేటాయించి, పూర్తిచేయాలని గ్రామస్తులు కోరారు. కల్యాణ మండపాన్ని పరిశీలించిన కలెక్టర్ అంచనాలు సిద్ధం చేయాలని పంచాయతీరాజ్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ మాధవిలత, డీఆర్‌డీఏ పీడీ బాలునాయక్, ఎల్‌డీఎం రాంప్రసాద్, నైపుణ్యాభివృద్ధి శాఖాధికారి తమ్మాజిరావు, తహసీల్దార్ వేణుగోపాలరావు పాల్గొన్నారు.

సదరన్ ప్రైవేటు ఉపాధ్యాయ సంఘం రికార్డ్

గుంటూరుఎడ్యుకేషన్: సదరన్ ప్రైవేటు అధ్యాపక, ఉపాధ్యాయ సంస్థ (ఎస్పీఎల్‌టీవో) అంతర్జాతీయ వండర్‌బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు దక్కించుకున్నట్లు సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ పయర్ల నాగయ్య గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా ఈనెల 19న గుంటూరులోని వేంకటేశ్వర విజ్ఞాన మందిరంలో జరిగిన కార్యక్రమంలో భాగంగా 151 మంది మహిళా ఉపాధ్యాయు లు, అధ్యాపకులు, ప్రొఫెసర్లు, విద్యాసంస్థల డైరెక్టర్లకు జాతీయ పురస్కారాలను ప్రదానం చేశామన్నారు.

మందలించారని పురుగుమందు తాగి ఆత్మహత్య

- భార్య, ఆమె తల్లిదండ్రులపై మృతుడి బంధువులు దాడి
- స్థానికులు అడ్డుపడడంతో తప్పిన ప్రమాదం
- బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు
- దాడికి పాల్పడిన వారిలో కానిస్టేబుల్

కొల్లూరు: భర్తను కోల్పోయిన భార్య, ఆమె తల్లిదండ్రులపై మృతుడి బంధువులు విచక్షణారహితంగా దాడికి పాల్పడిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని క్రాపకు చెందిన పట్టాభి అరుణ్‌కుమార్ (28)కు చేబ్రోలు మండలం నారాకోడూరుకు చెందిన మైనరు బాలిక కఠారి వైశాలితో గతేడాది అక్టోబర్ 10న వివాహం జరిగింది. కొద్దిరోజులు సజావుగా సాగిన కాపురంలో అరుణ్‌కుమార్ ఎటువంటి పనిచేయకుండా ఖాళీగా తిరుగుతూ, మద్యం తాగి వచ్చి వేధించడం ప్రారంభించాడు. నెలరోజులు గడిచిన అనంతరం గతేడాది నవంబర్ 10న మృతుడు అరుణ్‌కుమార్ సోదరి భర్త పులివర్తి రవి వైశాలిని ఆమె పుట్టింట్లో వదిలి వచ్చాడు. అరుణ్‌కుమార్ అప్పుడప్పుడు భార్య వద్దకు వెళ్లి వస్తుండేవాడు. అత్తమామలు తమ కుమార్తెను కాపురానికి తీసుకెళ్లాలని కోరారు. ఈ క్రమంలో ఈనెల 23న వైశాలి బంధువైన చిలకా కిరణ్, ఇతర పెద్దమనుషుల సమక్షంలో భార్యను కాపురానికి తీసుకెళ్లే విషయంపై అరుణ్‌కుమార్‌తో మాట్లాడేందుకు తెనాలి పిలిపించారు. చర్చల్లో భాగంగా మృతుడు భార్య తరఫున వకాల్తా తీసుకున్న పెద్దమనుషులు పద్ధతులు మార్చుకొని భార్యతో సజావుగా కాపురం చేసుకోవాలని మందలించారు. దీనితో తమ పెద్ద మనుషులను తీసుకొని వచ్చి అన్నీ మాట్లాడుకొని తన భార్యను కాపురానికి తీసుకువెళ్తానని అక్కడ నుంచి అరుణ్‌కుమార్ వచ్చేశాడు. అదే రోజు అర్ధరాత్రి తెనాలిలో పురుగుమందు తాగి తన స్నేహితుడు అతని భార్య, కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన విషయం తెలిపాడు. అప్పట్నుంచి తెనాలి ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్నాడు. పరిస్థితి విషమించడంతో ఈనెల 28న గుంటూరు జీజీహెచ్‌కి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. అనంతరం మృతుడి బంధువులు మరణానంతరం భార్యతో చేయించే కార్యక్రమాలకు రావాలని పిలవడంతో అతని భార్య, అత్తమామలు క్రాప వెళ్లారు. అరుణ్‌కుమార్ మరణానికి మీరే కారణమంటూ మృతుడి భార్య వైశాలిని, ఆమె తల్లి ధనలక్ష్మిని ఇంటిలోకి తీసుకొని వెళ్లి దాడికి పాల్పడ్డారు. పోలీసు కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న మృతుడి బావ పుల్లారావు, తల్లి రాజకుమారి, అరుణ్‌కుమార్ సోదరి శారద, ఆమె భర్త పులివర్తి రవిలు విచక్షణారహితంగా కొడుతూ, గర్భంతో ఉన్న వైశాలి కడుపుపై తొక్కారు. వీరిపై దాడి జరుగుతున్న సమయంలోనే మిగిలిన బంధువులు వైశాలి తండ్రి భూషణంపై మూకుమ్మడి దాడికి దిగారు. దాడిని గమనించిన స్థానికులు వచ్చి అడ్డుపడటంతో అక్కడ నుంచి బయటపడిన బాధితులు ఆటోలో వేమూరు మండలం జంపని వరకు చేరుకొని అక్కడ నుంచి 108 వాహనంలో తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు వెళ్లారు. భర్తను కోల్పోయి దాడికి గురైన బాధితురాలు వైశాలి వైద్యశాలలో చికిత్స పొందుతూ ఇచ్చిన ఫిర్యాదు మేరకు గురువారం కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ జి.ఏడుకొండలు తెలిపారు.

అంధుల అక్షర శిల్పి బ్రెయిలీ

జిల్లా జడ్జి పార్థసారథి

గుంటూరు రూరల్: అంధత్వం మనిషి శరీరానికే కానీ.. మానవ మేధస్సుకు ఏమాత్రం కాదని నిరూపించిన మహనీయుడు లూయి బ్రెయిలీ అని గుంటూరు జిల్లా ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ వైవీఎస్‌బీజీ పార్థసారథి కొనియాడారు. అంధుల అక్షర శిల్పిగా ఆయనను అభివర్ణించారు. జాతీయ అంధుల సమైక్య అమరావతి శాఖ ఆధ్వర్యంలో గురువారం గుంటూరు క్లబ్‌లో లూయి బ్రెయిలీ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా రాష్ట్ర స్థాయిలో జరిగిన పలు పోటీల్లో పెద్ద సంఖ్యలో అంధులు పాల్గొనడం విశేషం. ఈ పోటీలను జిల్లా జడ్జి ప్రారంభించారు. అనంతరం జడ్జి మాట్లాడుతూ.. వ్యక్తిగతంగా తాను అంధత్వాన్ని జయించడమే కాక యావత్ అంధులకు ప్రత్యేక లిపి ద్వారా సరికొత్త లోకాన్ని సృష్టించిన బ్రెయిలీ ఎందరికో ఆదర్శమని పేర్కొన్నారు. కష్టపడితే దరికి రానిది ఏదీ లేదన్న నమ్మకంతో ముందుకు సాగాలని కోరారు. సహాయ, సహకారాలు అందించేందుకు తామంతా సిద్ధంగా ఉంటామని తెలిపారు. అనంతరం పలు పోటీల్లో విజేతలకు ఏపీ బార్ కౌన్సిల్ క్రమశిక్షణ కమిటీ చైర్మన్, గుంటూరు క్లబ్ డైరెక్టర్ వి.బ్రహ్మారెడ్డి, కార్యదర్శి ఎస్.సాంబశివరావు, కోశాధికారి ఎం. భూపేన్ బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సామాజిక సేవా కార్యక్రమాల్లో గుంటూరు క్లబ్ ఎప్పుడూ చురుకైన పాత్ర పోషిస్తూనే ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో 4వ అదనపు జిల్లా జడ్జి ఆర్.శరత్‌బాబు, జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ కార్యదర్శి లీలావతి, ఎన్ఎఫ్‌బీఐ అమరావతి కార్యదర్శి పి. లక్ష్మీనారాయణ, కన్నా స్కూల్ కరస్పాండెంట్ కన్నబాబు, షిరిడీ సాయి దీన జన సేవా సమితి చైర్మన్ ఏ పూర్ణచంద్రరావు, ఎన్ఎఫ్‌బీఐ ఏపీ స్టేట్ అధ్యక్షుడు ఎస్.నాగార్జున, ప్రధాన కార్యదర్శి ఎం. రామసుబ్బాయ్య, నేషనల్ సెక్రటరీ కె. .నాగేశ్వరయ్య, ఏపీ జనరల్ సెక్రటరీ బి.విజయ రామారావు, అమరావతి అధ్యక్షుడు ఎస్.రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ ద్వితీయ సంవత్సర ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలి

నిజాంపట్నం: ఐటీఐ రెండు సంవత్సరాల కోర్సు ఉత్తీర్ణులైన విద్యార్థులు నేరుగా పాలిటెక్నిక్ ద్వితీయ సంవత్సర ప్రవేశానికి తమ కళాశాలలో బ్రిడ్జి కోర్సును నిర్వహిస్తున్నట్లు నిజాంపట్నం ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.సుధాకర్‌బాబు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బ్రిడ్జి కోర్సును ఫిబ్రవరి 21వ తేదీ వరకు నిర్వహించబడునన్నారు. ఐటీఐ రెండు సంవత్సరాల కోర్సు ఉత్తీర్ణులైన వారు పాలిటెక్నిక్ ద్వితీయ సంవత్సరంలో నేరుగా అడ్మిషన్ పొందేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్‌లతో కళాశాలలో సంప్రదించాలన్నారు. ఏటిఓ(ఫిట్టర్) కోర్సు కోసం జీ.వెంకటేశ్వరరావు (99635 09246), ఏటీఓ (ఎంసీడీ) కోర్సు కోసం ఎన్.ప్రసాదరావు (83099 14256) నంబర్లలో సంప్రదించాలని కోరారు.

రేపల్లె రైల్వేస్టేషన్‌కు సౌకర్యాలు కల్పించాలి

పట్టణాభివృద్ధి సంఘ కార్యదర్శి మోహనరావు

రేపల్లె రూరల్: పార్లమెంట్ సమావేశాలు శుక్రవారం నుంచి ప్రారంభం కానున్నాయని, ఫిబ్రవరి 1న ఆర్థికమంత్రి బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్న నేపథ్యంలో తీర ప్రాంతంలోని రేపల్లె రైల్వేస్టేషన్ అభివృద్ధిపై ఉమ్మడి గుంటూరు జిల్లా, బాపట్ల జిల్లా, మచిలీపట్నంలకు చెందిన పార్లమెంట్ సభ్యులు మాట్లాడాలని పట్టణాభివృద్ధి సంఘ కార్యదర్శి సీవీ మోహనరావు విజ్ఞప్తి చేశారు. స్థానిక కార్యాలయంలో గురువారం ఆయన మాట్లాడారు. లింగంపల్లిని టెర్మినల్ స్టేషన్‌గా నిర్ణయించి డెల్టా ఎక్స్‌ప్రెస్‌ను లింగంపల్లి-రేపల్లె, రేపల్లె-లింగంపల్లికి నడపాలన్నారు. డెల్టా ఎక్స్‌ప్రెస్ రేపల్లె నుంచి సికింద్రాబాద్‌కు ఉదయం 5 గంటలకు, లింగంపల్లికి 5.30కి వెళ్లే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. 12747, 12748 పల్నాడు ఎక్స్‌ప్రెస్ రేపల్లె-వికారాబాద్-రేపల్లె మధ్య నడిచేవిధంగా, 17243, 17244 రాయ్‌గడ్ ఎక్స్‌ప్రెస్ రేపల్లె-రాయగడ్-రేపల్లె మధ్య, 17261, 17262 నంబరు తిరుపతి ఎక్స్‌ప్రెస్‌ను రేపల్లె-తిరుపతి-రేపల్లె మధ్య నడిచేవిధంగా చర్యలు చేపట్టాలన్నారు. 20701, 20702 సికింద్రాబాద్-తిరుపతి- సికింద్రాబాద్ వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌ను బాపట్లలో ఆపేవిధంగా, విజయవాడ-రేపల్లె- విజయవాడల మధ్య పలు ప్యాసింజర్ రైళ్లు నడిచే విధంగా పార్లమెంట్ దృష్టికి తీసుకెళ్లాలన్నారు. రేపల్లెలో పిట్ సౌకర్యం కల్పించేందుకు, మచిలీపట్నం-రేపల్లె-నిజాంపట్నం-బాపట్ల రైల్వేలైన్ ఏర్పాటు చేయుటకు, రేపల్లె-తెనాలి రెండో రైల్వేలైన్ ఏర్పాటుకు పార్లమెంట్‌లో సభ్యులు ప్రస్తావించి తీరంలోని రైల్వేకు వరలాల జల్లులు కురిపించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

పారిపోయిన విద్యార్థులు క్షేమంగా ఇంటికి..

దాచేపల్లి : చదువుకోమని తల్లిదండ్రులు మందలించడంతో ఇంటి నుంచి పారిపోయిన విద్యార్థులను 24 గంటల్లో పోలీసులు పట్టుకున్నారు. దాచేపల్లి ఎస్ఐలు సౌందర రాజన్, పాపారావు గురువారం వివరాలు వెల్లడించారు. మండలంలోని కేసానుపల్లి గ్రామానికి చెందిన మీసాల డేవిడ్, ఇర్లా శ్రీనివాసరావు, నగేష్ కృష్ణ స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నారు. బడికి వెళ్లకుండా తిరుగుతుండటంతో వీరిని తల్లిదండ్రులు మందలించారు. దీంతో ఈ ముగ్గురూ బుధవారం మధ్యాహ్నం ఇంటి నుంచి పారిపోయారు. నడికూడి రైల్వే స్టేషన్‌లో రేపల్లె ప్యాసింజర్ ఎక్కి రేపల్లెలో దిగి అక్కడ నుంచి సికింద్రాబాద్ చేరుకుని, జడ్చర్లకు వెళ్లారు. జడ్చర్లలో అనుమానాస్పదంగా తిరుగుతున్న విద్యార్థులు స్థానిక పోలీసులు గుర్తించి స్టేషన్‌కు తరలించారు. వారి నుంచి సమాచారం సేకరించి, దాచేపల్లి పోలీసులకు తెలిపారు. పోలీసు సిబ్బంది జడ్చర్లకు చేరుకుని విద్యార్థులను తీసుకొచ్చి, స్టేషన్‌లో తల్లిదండ్రులకు అప్పగించారు. పిల్లల పట్ల అప్రమత్తంగా ఉండాలని పోలీసులు తల్లిదండ్రులకు సూచించారు.

కన్న తండ్రిని కాల్వలోకి తోసి చంపిన కొడుకు

ఈపూరు(శావల్యాపురం): కన్న తండ్రినే కాల్వలోకి తోసి చంపాడు కొడుకు. ఈ ఘటన ఈపూరు మండలంలోని భద్రుపాలెం గ్రామం సమీపంలో సాగర్ కుడి కాల్వ వద్ద గురువారం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. నూజెండ్ల గ్రామానికి చెందిన గంగినేని కొండయ్య (80)కు ఇద్దరు కొడుకులు. మొదటి కుమారుడు వెంకటేశ్వర్లు నూజెండ్లలో ఫ్యాన్సీ షాపు నిర్వహిస్తున్నాడు. ఇటీవల కొండయ్య భార్య మృతి చెందింది. గంగినేని వెంకటేశ్వర్లు తండ్రిని చూసుకుంటున్నాడు. ఈ నేపథ్యంలో తండ్రి కొండయ్యను ఆరోగ్యం సరిగా లేదని చెప్పడంతో వైద్యశాలకు కారులో తీసుకెళ్లాడు. మార్గ మధ్యలో మూత్ర విసర్జన దిగిన కొండయ్యను భద్రుపాలెం సమీపంలోని సాగర్ కెనాల్‌లో వెంకటేశ్వర్లు తోసేసినట్లు స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో ఈపూరు ఎస్సై ఎం.ఉమామహేశ్వరరావు ఘటన స్థలానికి చేరుకున్నారు. స్థానికులు సాయంతో పోలీసులు కాల్వలోని మృతదేహాన్ని వెలికితీశారు. మృతదేహాన్ని వినుకొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

నేడు మిర్చి యార్డు కార్యదర్శిగా చంద్రిక బాధ్యతల స్వీకరణ

కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డు కార్యదర్శిగా ఎ.చంద్రిక శుక్రవారం ఉదయం 9.30 గంటలకు బాధ్యతలు స్వీకరించనున్నారు. విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ ప్రాజెక్టు అధికారిణిగా పనిచేస్తున్న చంద్రికను ఏడాది పాటు డిప్యుటేషన్ మీద కొనసాగేలా వ్యవసాయ మార్కెటింగ్ శాఖ ఎక్స్ ఆఫిషియో స్పెషల్ చీఫ్ సెక్రటరీ బి.రాజశేఖర్ ఇప్పటికే ఉత్తర్వులు జారీ చేశారు. అంతేకాకుండా ఆమెను ఏడాది పాటు గుంటూరు వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ సెలక్షన్ గ్రేడ్ కార్యదర్శిగా డిప్యుటేషన్‌పై నియమించుకునేందుకు మున్సిపల్ పరిపాన శాఖ ఇప్పటికే అనుమతి ఇచ్చింది. మార్కెటింగ్, మున్సిపల్ శాఖల నుంచి ఆమెకు లైన్ క్లియర్ అవ్వడంతో శుక్రవారం ఆమె మిర్చి యార్డు కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టనున్నారు. ఇప్పటి వరకు యార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శిగా పనిచేసిన వినుకొండ ఆంజనేయులు రాజమహేంద్రవరం మార్కెట్ యార్డు సెలక్షన్ గ్రేడ్ కార్యదర్శిగా వెళ్లనున్నారు.

వైద్యవిద్య సీటు పేరిట రూ.12 లక్షల మేరకు మోసం

జేకే కన్సల్టెంట్ ఏజెంట్ రాజేష్‌పై కేసు నమోదు

తాడికొండ: జార్జియాలో ఎంబీబీఎస్ సీటు ఇప్పిస్తానని ఎడ్యుకేషన్ కన్సల్టెంట్ రూ.12 లక్షలు స్వాహా చేసిన ఘటనపై తాడికొండ పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ కె.వాసు తెలిపిన వివరాల ప్రకారం... దామరపల్లి గ్రామానికి చెందిన దాసరి యశోదలక్ష్మి తన కుమారుడు వెంకటేష్‌కు ఎంబీబీఎస్ సీటు కోసం గుంటూరుకు చెందిన జేకే కన్సల్టెంట్‌ను సంప్రదించారు. అందులో ఎడ్యుకేషన్ కన్సల్టెంట్‌గా పనిచేస్తున్న తుమ్మలపూడి రాజేష్ జార్జియా దేశంలో ఎంబీబీఎస్ సీటు ఇప్పిస్తానని మాయమాటలు చెప్పి పలు దఫాలుగా రూ.12 లక్షల నగదు, ఒరిజినల్ సర్టిఫికెట్లు తీసుకున్నాడు. సీటు ఇప్పించకపోగా.. నగదు, సర్టిఫికెట్లు తిరిగి ఇవ్వకుండా బాధితులను బెదిరిస్తుండటంతో దాసరి యశోదలక్ష్మి తాడికొండ పోలీసులను ఆశ్రయించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు తుమ్మలపూడి రాజేష్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు 416 పోలింగ్ కేంద్రాలు

- కోడ్ అమలుకు పార్టీలు సహకరించాలి
- జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి వినతి

లక్ష్మీపురం: ఉమ్మడి కృష్ణా, గుంటూరు గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలుకు అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ ఎస్. నాగలక్ష్మి కోరారు. గురువారం కలెక్టరేట్‌లోని వీసీ సమావేశ మందిరంలో సంయుక్త కలెక్టర్ ఏ భార్గవ్ తేజ, డీఆర్‌ఓ షేక్ ఖాజావలి, ఆర్డీఓ కె.శ్రీనివాసరావులతో కలసి ఎన్నికల నోటిఫికేషన్ విడుదలపై కలెక్టర్ సమావేశం నిర్వహించారు. బహుజన్ సమాజ్ పార్టీ తరఫున చిరతనగండ్ల వాసు, భారతీయ జనతా పార్టీ నుంచి చరక కుమార గౌడ్, సీపీఎం తరఫున వై.కృష్ణకాంత్, తెలుగుదేశం పార్టీ నుంచి కంచర్ల శివరామయ్య, జనసేన తరఫున గాదె వేంకటేశ్వరరావు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున అత్తోట జోసఫ్ , కాంగ్రెస్ పార్టీ నుంచి బిల్లా సునీల్, ఆప్ తరఫున టి. సేవాకుమార్ పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికలకు సంబంధించి ఈ నెల 29 నాటికి మొత్తం 3,46,614 మంది ఓటరుగా నమోదు అయ్యారని చెప్పారు. 416 పోలింగ్ స్టేషన్లు గుర్తించడం జరిగిందన్నారు. ఓటరుగా నమోదు చేసుకునేందుకు జనవరి 31వ తేదీ వరకు అవకాశం ఉందన్నారు. సమావేశంలో రిటర్నింగ్ అధికారులైన స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ లక్ష్మీకుమారి, జీఎంసీ అదనపు కమిషనర్ ఓబులేశు పాల్గొన్నారు.